www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 జులై 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఎస్‌డబ్ల్యుఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఆర్‌టిసి 2 డిపో మేనేజర్ తక్షణం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌టిసి- 2 డిపో ఎదుట ఉద్యోగులు 4వ రోజు ధర్నా చేపట్టారు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్కే జలానీ బాషా, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి కష్ణారావు మాట్లాడారు. నెల్లూరు వన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జయరామయ్య నెల్లూరు 2 డిపో అధ్యక్ష కార్యదర్శులు ఖయ్యూం, చంద్రయ్య ఉన్నారు.

జనజీవనం అస్తవ్యస్తం..!

కూరగాయలు..నిత్యావసర ధరలు గగనం - విద్యుత్ ఛార్జీలు, పౌష్టికాహారం అదే పరిస్థితి

ప్రజల జీవన విధానాంలో అనూహ్య మార్పు కనిపిస్తోంది. కొద్ది రోజులుగా నిత్యావసర ధరలు ఆకాశన్నం టుతున్నాయి. టమోటాలు కన్నీళ్లు తెప్పి స్తున్నాయి. విద్యుత్ ఛార్జీలు భారీగా చేతిలో పెడుతున్నారు. ఆస్తిపన్ను, పెట్రోల్, డీజిల్‌తోపాటు పౌష్టికాహారం సైతం అందడం లేదు. మాంసం, గుడ్లు ధరలు భారీగా పెరిగి పోయాయి. నిరుపేదల జీవన విధానాం అస్తవ్యస్తంగా మారింది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ విధానాలు నిరుపేదలకు కంటిమీద కునుకు పట్టినివ్వనీయడం లేదు. కార్మికులు, కర్షకులు, భవన నిర్మాణ కార్మికులు జీవనం ముందుకు సాగడం లేదు. కంపెనీల్లో పనిచేస్తున్న వారికి రూ. 15 వేల లోపే జీతాలు అందుతున్నాయి. ఇతర పనుల్లో ఉండేవారికి రోజు కూలీలకు అరకొర నగదు వస్తుంది. కొద్ది రోజులుగా నిత్యావసర ధరలు ఆకాశన్నం టుతు న్నాయి. మిరప కాయలు, కందిపప్పు, చింతపండు, ఇతర ఏ వస్తువులు కొనుగోలు చేసే పరిస్థితుల్లో కనిపించడం లేదు. చింతపండు కేజీ రూ.220 వరకు పలుకుతోంది. ఎండుమిరప రూ.260, వేరుశనగపప్పు రూ.135, జిలకర రూ.680, చక్కెర రూ.42, తెల్లగడ్డలు రూ.130, మినపప్పు రూ.110, కందిపప్పు రూ.150, పచ్చనగపప్పు రూ.150, ఎర్రగడ్డలు రూ. 24 పలుకుతోంది. గత నెలకంటే భారీగా పప్పుల ధరలు పెరిగాయి. కూరగాయల ధరలు ఆకాశన్నం టుతున్నాయి. టమోట మోత మోగిస్తుంది. మార్కెట్‌లో రూ.120 నుంచి రూ.140 వరకు పలుకుతోంది. దీంతోపాటు మాంసం ధరలు పెరిగాయి. ఇటీవల వరకు చికెన్ రూ.310 ఉండగా, ప్రస్తుతం కాస్త తగ్గుముఖం పట్టింది. కోడి గుడ్డు ధర రూ.8 వరకు అమ్ముతున్నారు. పెరిగిన ధరలతో జనం గగ్గోలు పెడుతున్నారు. అటు నిత్యావసర ధరలు, ఇటు కూరగాయల ధరలు పెరిగిపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్లు విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయి. గత నెలలో పోల్చుకుంటే పలురకాల ఛార్జీల పేరుతో నిరుపేదలను వదలకుండా చేస్తున్నారు.

ఆహారం ప్రియం..!

నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు పెరిగిపోవడంతో ఆహారం ధరలు పెరిగాయి. కర్రీస్ పాయింట్స్‌ల్లో పప్పు, సాంబర్, రసం, చట్నీ గతంలో రూ.30 ఉండగా ఒక్కసారిగా రూ.10 పెంచి, రూ.40 చేశారు.ఇవే కాకుండా అన్ని కూరలు పైనా అదనంగా పెరిగాయి. నిత్యావసర, కూరగాయాలు ధరలు పెరగడంతోనే తాము పెంచామని చెబుతున్నారు. హోటళ్లల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చికెన్ ధరలు పెరగడంతో బిరియాని, చికెన్ ఐటమ్స్ కూడా పెరిగిపోయాయి. పెరిగిన ధరలతో నిరుపేదల జీవన విధానంలో పెను మార్పులు కనిపి స్తున్నాయి. వివిధ శుభకార్యాలయాలకు మెనూ కూడా భారీగా పెరిగింది. ఎటు చూసినా ప్రభుత్వానికి ధరలపై నియ ంత్రణ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఉప్పు రైతులను ఆదుకుంటాం..

అల్లూరులో లోకేష్ పాదయాత్ర - అడుగడునా ఘన స్వాగతం

లోకేష్‌ను భారీ గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉప్పు రైతులను తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తానే ఆదుకుంటామని టిడిపి యువనేత నారా లోకేష్ అన్నారు. శనివారం 150 రోజు పాదయాత్ర నెల్లూరు జిల్లా కావలి నియోజవర్గంలోని అల్లూరు, క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమైంది. దారిపొడవునా పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అల్లూరు పోలేరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. గోగులపల్లి, సింగంపేట, తూర్పు గోగులపల్లి, ఊడిపిగుంట, ఊదూరుగుంట, ఎర్రప్పగుంట, తాటిచెట్లపాళెం, బంగారుపాళెం ప్రాంతాల్లో పాదయాత్ర సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళారూపాలతోపాటు, పూలవర్షాలు, దిష్టితీయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, యువకులు లోకేష్‌ను కలవడానికి ఆసక్తి చూపించారు. అంతకు ముందు ఇస్కపల్లిలో ఉప్పు రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉప్పు సాగు చేస్తున్న రైతులకు కనీసం సాయం అందడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ఉప్పు రైతులను జగన్ ప్రభుత్వ ఉప్పు రైతులను దోచుకుంటుందన్నారు. పండించిన ప్రతి పంటకూ క్రాప్ ఇన్సూరెన్స్ ఉందని, ఉప్పుకి మాత్రం ఇన్సూరెన్స్ లేదన్నారు. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పండించిన పంటలను తీసుకెళ్లడానికి రోడ్లు సరిగా లేవన్నారు. ఎన్నో ఏళ్ళ ుగా ఉప్పు సాగుచేసుకుంటున్నా తమకు పట్టాలు ఇవ్వలేదన్నారు. నారా లోకేష్ మాట్లాడుతూ ఉప్పు రైతులను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఉప్పు లేనిదే కూరలేదన్నారు. చంద్రబాబునా యుడు సిఎం గాఉన్నప్పుడు ఉప్పు పొలాలకు రోడ్లు వేయడం జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఇచ్చిన ధరలకే విద్యుత్ ఇస్తామన్నారు. జగన్ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామన్నారు. ఉప్పు రైతులకు పొలాల వద్దే ఉప్పు నిల్వచేసుకోడానికి షెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్సూరెన్స్ విష యంలో చర్చించి నిర్ణయం తీసుకుంటా మన్నారు. ఇతర రైతులకు ఇచ్చినట్లు సబ్సిడీ ఇస్తామన్నారు. ఉప్పుసాగుచేసుకునే రైతులకు సబ్సిడీతో ట్రాక్టర్లు, మనిముట్లు అందిస్తామన్నారు. లోకేష్ పాద యాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నేతలు ఎం. సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి, బీద జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారితో ఆప్యాయంగా లోకేష్..

ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి -నెల్లూరు :ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.శనివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నెల్లూరు 1 డిపో మేనేజర్‌గా పనిచేస్తు రిటైర్డు అయిన భాస్కర్‌రెడ్డి, ప్రస్తుతం ఆర్‌టిసి 1 డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమణ, వర్కషాపు స్టోర్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ రిటైర్డు అయిన జార్జిలను ఘనంగా సత్కరించారు. రామసుబ్బయ్య, సుగుణమ్మ, గౌరీప్రసాద్, రాధాక్రిష్ణ , వి.పి నరసింహారెడ్డి ఉన్నారు.

హెల్మెట్లు పంపిణీ

ప్రజాశక్తి -గుడ్లూరు :గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 94 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు సుమారు రూ. 25 వేలు విలువైన హెలిమెట్లు పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యా యులు బత్తల నాగేశ్వరరావు జ్ఞాపకార్థం 60 మందికి హెల్మెట్లు ఉచితంగా అందజేశారు.ఉపాధ్యాయులు బచ్చల వెంకటేశ్వర్లు, మానవ సుబ్బారావు, గుడ్లూరు ఎస్సై రాములు చేతుల మీదగా ద్విచక్ర వాహన శోధకులకు అందజేశారు.

సిఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నూతన సిఐగా ఎస్.కె హఫీజ్ భాషా శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. గుంటూరు రేంజ్ ఆఫీసులో వి ఆర్ లో ఉన్న హఫీజ్ భాషను కందుకూరు సిఐ గానియమిస్తూ శనివారం ఉత్తరవులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు కందుకూరు సిఐగా పనిచేస్తున్న వెంకటరావును విఆర్ కు పంపించారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : పేదవారి సహాయార్థం నిర్వహిస్తున్న ఎన్నో కార్యక్ర మాల్లో భాగంగా కందుకూరు పట్టణంలో శనివారం సంస్థ నిర్వాహకులు ఊరి బయట నివాసముండే ప్రాంతాల్లో వద్ధులకు, పిల్లలకు దుస్తులు అందజేశారు. ప్రెసిడెంట్ సాజిద్, సెక్రటరీ షంషేర్, ట్రజరర్ హఫీజ్, ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషఉద్దీన్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి -పొదలకూరు :మండలంలోని వావింటపర్తి గ్రామ సచివాలయ సర్వీసుల క్యాంపు శనివారం వావింటపర్తి సచివాలయంలో జరిగింది. ఈనెల 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష ప్రారంభమైంది.ఈ నేపథ్యంలో పలు రకాల సేవలను లబ్ధిదారులకు అంద జేస్తున్నారు. అందులో భాగంగా శనివారం పలు సేవలను అందజేశారు. ఇఒపిఆర్‌డి నరసింహ రెడ్డి , పులికల్లు, వావింటపర్తి పంచాయతీ ల సర్పంచ్‌లు జవి సుబ్బమ్మ, నెట్టెం. వెంకటకష్ణయ్య, కన్వీనర్లు కే. సరోజనమ్మ, ఎన్. సుబ్రమణ్యం, మాల్యాద్రి, నాయకులు పెంచలరెడ్డి, నారాయణ రెడ్డి, కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, సహాయ పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, పెంచల నారాయణ ఉన్నారు.

కుక్కలకు వ్యాక్సిన్

ప్రజాశక్తి-కందుకూరు

ప్రపంచ జూనోటిక్ డే సందర్భంగా మండలంలోని పలుకూరు గ్రామంలో వీధికుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు శనివారం వేశారు. గ్రామ సచివాలయ పశుసంవర్ధక సహాయకులు కాళిదాసు చైతన్య ఈ వ్యాక్సిన్‌ను వేశారు. ఆయన మాట్లా డుతూ యాంటీ రాబిస్ టీకాలు వేయడం వలన కుక్కకాటు వలన వచ్చే ప్రాణాంతకమైన రాబిస్, ఇతర జంతు సంబంధ వ్యాధులను నివారిం చవచ్చునని పేర్కొన్నారు ఎన్‌జిఒ ఆర్గనైజేషన్ పీపుల్స్ ఫర్ యానిమల్ సభ్యులు జి చిరంజీవి, సామాజిక కార్యకర్త సుకుమార్ పాల్గొన్నారు.

'నారాయణ'లో అరుదైన శస్త్ర చికిత్స

కడుపులో ఒకటిన్నర కేజీ వెంట్రుకల తుట్టె - తొలగించిన వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న నారాయణ వైద్యులు

ప్రజాశక్తి-నెల్లూరు :నారాయణ వైద్యశాల వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. జిల్లాలోని కలువాయి మండలంలోని బాలాజీ కాలనీకి చెందిన నరసింహాకు శస్త్ర చికిత్స చేసి కడుపులోని ఒకటిన్నర కిలో బరువు గల గడ్డ (గుడ్డముక్కలు, వెంట్రుకలు) తొలగించారని ఆ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణ వైద్యశాలలోని మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది తమ ఆరోగ్యంపట్ల సరైన అవగాహన లేక, మానసిక స్థితి బాగోలేక చేసే పనుల వల్ల ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారన్నారు. అటువంటి స్థితిలో కలువాయి, బాలాజీకాలనీకి చెందిన నరసింహా అనే బాలుడు వాంతులు, కడుపునొప్పి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడన్నారు. ఆ సమయంలో తల్లిదండ్రులు వైద్యచికిత్సల నిమిత్తం నారాయణ వైద్యశాలకు తీసుకొచ్చారన్నారు. బాలుడికి పరీక్షలు నిర్వహించిన నారాయణ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వి.మహీధర్ రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ జి.వి ప్రకాష్ ,అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట హరీష్ ఆహారపు అలవాట్ల గురించి ఆరా తీయగా ఆ బాలునికి చిన్నప్పటి నుంచి గుడ్డ ముక్కలు, వెంట్రుకలు తినే అలవాటు ఉన్నట్లు గుర్తించారన్నారు. ఆ బాలునికి అవసరమైన పరీక్షలు చేసి, స్కానింగ్ చేయగా కడుపులోని పేగులో గుడ్డముక్కలు అన్నీ కలిపి ఒక గడ్డలా ఏర్పడినట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ విధంగా వెంట్రుకల గడ్డలాగా ఏర్పడుతున్న జబ్బుని వైద్యపరిబాషలో రపుంజెల్ సింద్రోమ్ అంటారన్నారు. ఈ విధమైన జబ్బు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 మందిలో మాత్రమే గమనించారన్నారు. ఈ సమస్య సహజంగా స్త్రీలలో కనిపిస్తుందని, మగ పిల్లల్లో కనిపించడం చాలా అరుదైన ఘటన అన్నారు. ఈ గడ్డ కింది వైపు చిన్న పేగుల వరకు వ్యాపించి ఉండటంతో మినీ ల్యాపరోటమి ద్వారా ఆపరేషన్ చేసి పొట్టలో ఉన్న గడ్డను తొలగించామన్నారు. వెంట్రుకలు పేగుల చుట్టూ చేరి ఏడు చోట్ల పేగులు ముడతలు పడి ఉన్నాయన్నారు. వాటన్నింటిని కూడా సరిచేసి, వెంట్రుకలను పూర్తిస్థాయిలో తొలగిం చామ న్నారు. ఈ శస్త్ర చికిత్స పూర్తిగా ఆరోగ్య శ్రీ పథకం కింద నిర్వహించామన్నారు పిల్లవాడు మళ్లీ ఇటు వంటివి చేయకుండా సైకియాట్రిస్ట్ వద్ద కౌన్సెలింగ్ ఇప్పించా మన్నారు. ఇప్పుడు పిల్లవాడు ఎటువంటి సమస్య లేకుండా ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. శస్త్ర చికిత్సలు చేసిన వైద్యులను ఆయన అభినందించారు.



వైద్యులు తొలగించిన వెంట్రకలు, గుడ్డలతో కూడిన తుట్టె

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు

స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట నిర్మించిన పురపాలక సంఘ వాణిజ్య సముదాయాన్ని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా 45 షాపులు కట్టటానికి ప్రతిపాదించగా వాటిలో ఈ రోజు 16 రూములు ప్రారంభించారన్నారు. మరో 4,5 రోజుల్లో పాత కూర గాయలు మార్కెట్ వద్ద 8 రూములు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతు బజారు పక్కన ఉన్న ఓల్డ్ లారీ స్టాండ్ స్థలంలో సుమారుగా 55 సెంట్ల స్థలం ఉఉందన్నారు. ఆ స్థలంలో 18 రూములు కట్టటానికి టెండర్స్ పిలిచిమన్నారు. కొత్తగా అన్ని హంగులతో ప్రారంభించిన పార్కు వద్ద ఒక రూము, 60 అడుగుల రోడ్డు వద్ద కొన్ని రూములు కట్టి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంపొం దించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మన్నారు. తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ ,సిఐ వెంకటరావు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

అదాని స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు

సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ పరీక్షల్లో అదాని స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ సిరియాల సత్యనారయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపి యాడ్(ఐఎంఒ) లో 3వ తరగతికి చెందిన పి. తీర్థంకర్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు తో రజిత పతకం సాధించగా, నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ (ఎస్ఓఎఫ్)లో 1వ తరగతి కి చెందిన అనన్య దేశ్ ముఖ్ అంతర్జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించారన్నారు. 1వ తరగతి కి చెందిన దర్శిత్ కార్తికేయ వర్మ జోనల్ స్థాయి లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారన్నారు. వీరితో పాటుగా 10 మంది విద్యార్థులు డిస్టింక్షన్ లెవెల్స్‌లో గోల్డ్ మెడల్స్‌ను, ఇంకో 24 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధిం చారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మరో సారి తమ విద్యార్థులు ప్రశంస నీయమైన విజయాలతో పాఠశాల ఖ్యాతిని పెంచి తాము గర్వపడేలా చేశార న్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్ తో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ తో పాటు గా మిగతా ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన అదాని స్కూల్ విద్యార్థులు

సచివాలయంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - పొదలకూరు

సచివాలయాల్లో 543 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు కలెక్టర్ ఎం. హరి నారాయణన్ పేర్కొన్నారు. మండలంలోని మొగళ్లూరులో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 సర్వీసులను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో క్యాంపు నిర్వహించే వారం రోజుల ముందు నుంచే వాలంటీర్లు ఇంటింటికి తిరిగి అవసరమైన సర్టిఫికెట్లు,పథకాల అందని వారిని గుర్తించి వారికి ఆ పథకాలు అందేలా తగు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ సచివాలయ పరిధిలో 350 రకాల సేవలను అందజేస్తున్నట్లు చెప్పారు జగనన్న సురక్షతోపాటు జగనన్నకు చెబుదాం..కార్యక్రమాన్ని అనుసంధానం చేసినట్లు వివరించారు. సిఎం సెక్రటరీ ముత్యాల రాజు, డిఎల్‌డిఒ వసుమతి, డిఆర్డిఎ పి డి సాంబశివారెడ్డి, మొగళ్లూరు సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మాలకొండ' ఆదాయం రూ. 10 లక్షలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల నుండి వివిధ రూపాల్లో రూ. 10,51,905 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. అత్యధికంగా ప్రత్యేక దర్శనం ద్వారా 3003 మంది దర్శించుకోగా, రూ. 3,00,300, అన్నధానం విరాళం రూ. 4,13,414, లడ్డూ ప్రసాదం అమ్మినందుకు రూ. 2,06,125తో పాటు ఇతర రూము అద్దెలు, తలనీలాలు, వాహనపూజలు తదితరాల ద్వారా పై ఆదాయం సమకూరింది.

నిరసన తెలుపుతున్న బిటిఎ నాయకులు

సిపిఎస్‌ను రద్దు చేయాలి : బిటిఎ

ప్రజాశక్తి -కందుకూరు : ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్‌ను ప్రవేశపెట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన(బిటిఎ) కందుకూరు డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోరుతూ కందు కూరులోని అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. రాష్ట్ర పధాన కార్యదర్శి కె మోహన్ రావు మాట్లాడారు. బి టి ఏ డివిజన్ అధ్యక్షులు అబ్దుల్లా రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లమందయ్య వివిధ మండల శాఖ బాధ్యులు అంజయ్య, శ్రీనివాసులు, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, గంగయ్య,కె వై కోటయ్య,సి హెచ్ కొండలరావు, హరిబాబు పాల్గొన్నారు.

నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట
మండలంలోని అల్లిమడుగు గ్రామంలో పది రోజులుగా నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ 1వ వార్డులో నీరు లేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు, దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవి కలిసి ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిరసన కార్యక్రమం తెలిపి, ఎంపిడిఓ వెంకటసుబ్బయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లిమడుగు గ్రామంలో కనీసం మనుషులు తాగడానికి నీరు కూడా దొరకడం లేదంటే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఏ విధంగా బోగోలు మండలంలో పనిచేస్తున్నారని అర్థం చేసుకోవచ్చన్నారు. దళితుల ఆధునికీకరణలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, దళితవాడలో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వ అధికారులు వహిరిత ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలని, తాగడానికి పశువులకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే నీరు అందించే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. గ్రామస్తులు శ్రీనివాసులు, రఫీ, రమణమ్మ, వెంకమ్మ, రమేష్, రియాజ్, కిరణ్ పాల్గొన్నారు.

రైతు బాంధవుడు 'వైఎస్ఆర్'

ప్రజాశక్తి-ఉదయగిరి : రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కళ్యాణ మండపంలో ఘనంగా రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తాను చేసిన పనుల తో చిరస్థాయిగా నిలిచిపోయారని, ముఖ్యంగా ఆయన రైతులకు చేసిన మేలుతో రైతు బాంధవుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మాటలు తప్పు అని రైతే రాజుగా నిరూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతిగా ముద్ర వేశారన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా రైతు బాంధవుడుగా చిరకాలం తండ్రీకొడుకులు రైతుల గుండెల్లో నిలిచిపోతారని కీర్తించారు. అనంతరం జిల్లా కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన మహాసభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం 127 మంది రైతుల పరిహార నగదును చెక్కును జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. అనంతరం మార్కెట్ యార్డ్ వ్యవసాయ శాఖలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్, జిల్లా అగ్రికల్చర్ చైర్మన్ నిరంజన్ రెడ్డి, జిల్లా జెడిఎ సుధాకర్ రాజు, ఇన్‌ఛార్జి ఎడిఎ చెన్నారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, వైసిపి యువ నాయకులు మేకపాటి అభినవ రెడ్డి, షర్ఫుద్దీన్, వైసిపి యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి, కామేపల్లి వెంకటరత్నం, మాజీ ఎఎంసి చైర్మన్ అలీఅహ్మద్, మాజీ కన్వీనర్ మూలే సుబ్బారెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, సచివాలయ మండల జెసిఎస్ కల్లూరి కృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-కావలి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై, ఆయన సతీమణి అన్నా లెజినోవాపై వక్రీకరణగా ట్విట్టర్‌లో పోస్టులు అసభ్యకరంగా పెట్టిన వర్రా రవీంద్రరెడ్డిపై జనసైనికుల అందరికి బాధ కలిగి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అందరూ కలిసి, శనివారం డిఎస్‌పికి కంప్లైంట్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ సతీమణిపై దుర్భాషలాడిన వర్రా రవీందర్ రెడ్డి అనే వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆదేశాల మేరకు నాయకులు సమ్మల వెంకటసుబ్బయ్య, రిపేశ్, ఆలా శ్రీకాంత్, సుధీర్, మండ శ్రీను, పిటు భువనేశ్వర్, బిల్లకొండ వెంకటేశ్వర్లు, బిల్లకొండ మస్తాన్, గాదె నాగార్జున, గాధంశెట్టి రవి, తోకల వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సాయి మధుసూదనరావు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కొడవలూరు : కాలువలో ఈతకు వెళ్లి శుక్రవారం యువకుడు గల్లంతవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో శనివారం యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన మండలంలోని కొత్త వంగల్లు సమీపంలోని తూర్పు కాలువలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్త వంగల్లు మధిర చికిరేత్ గుంట గిరిజన కాలనీకి చెందిన ధ్యాన పవన్ (20) వరి కోత యంత్రం ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం వరి కోతలు లేకపోవడంతో ఆపరేటర్ పని లేక ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తూర్పు కాలువలో ఈతకు వెళుతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి పవన్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఎస్ఐ జి.సుబ్బారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు కొత్త వంగల్లు సమీపంలోని కాల్ (ఎడుమతూలాలు)లో వద్ద పవన్ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడికి ఈత తెలిసినప్పటికీ కాలువలో నాచు ఎక్కువగా ఉండడం మృతుడు మద్యం సేవించి ఉండడం వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీ లోని పుసులకాలనీకి చెందిన దిబ్బలి సుబ్బారాయుడు అనే వ్యక్తి పక్షవాతం వ్యాధి వల్ల కాలు, చేయి పని చేయక కనీసం వైద్య చికిత్సలు చేయించుకొనే ఆర్థిక స్తోమత లేకపోవడాన్ని తెలుసుకున్న ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకుడు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ వెంటనే స్పందించిన ఆయన సీతారామపురం మండలం ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా రూ.10వేల నగదును మాజీ సర్పంచ్ పిన్నిబోయిన రమణయ్య అందించారు. కార్యక్రమంలో ట్రస్టు కోఆర్డినేటర్ సుమన్, సభ్యులు తిరుపయ్య, కన్నా, బుజ్జి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త 'వైఎస్ఆర్'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ప్రజలందరికీ ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాల సృష్టికర్త, మెట్టప్రాంత అభివృద్ధి ప్రదాత, జలయజ్ఞం ద్వారా ప్రాజెక్టు నిర్మాణాల రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం డాక్టర్ వైఎస్ఆర్ 74వ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఘన నివాళులర్పించారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వేదిక పై కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన పాలనలో ఎన్నో నూతన సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. తాను అమెరికాలో విద్యాభ్యాసం చేసే సమయంలో 911 అనే నెంబరుకు అంబులెన్స్ సర్వీసు ఉండేదని, ఆ సమయంలో దేశంలో కూడా ఇలాంటి వ్యవస్థ ఉంటే బాగుంటుందని భావించానని తెలిపారు. అనంతరం కొన్నాళ్ల తర్వాత వైఎస్ఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 108 వాహనాలను ప్రారంభించారన్నారు. ఇలాంటి సంకల్ప ఆలోచనలతో రాష్ట్రాన్ని ఎంతో ముందుకు తీసుకువెళ్లారని వివరించారు. అనంతరం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో బస్సుల రాకపోకలకు ఆయన ఆర్‌టిసి అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఆత్మకూరు ఎంజిఆర్ మున్సిపల్ మెమోరియల్ బస్టాండ్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎసి బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ ఛైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, బి.వి. రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్, నాయకులు పాల్గొన్నారు.

10, 11తేదీల్లో అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-కావలి
అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు 10,11 తేదీలలో జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద జరిగే 36 గంటల ధర్నాను అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం కావలి సిఐటియు కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను అంగన్ వాడీలు ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘ గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలైనా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారం కాలేదని ఎన్నిసార్లు ప్రభుత్వానికి తెలియజేసిన పరిష్కరించ లేదన్నారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం పనిభారం ప్రారంభించిందని రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయని ఇంకా అనేక సమస్య లతో అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. "పని ఎక్కువ - వేతనం తక్కువ"తో పనులు చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం రూ.13,500 వేతనం ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రూ.10500 ఇస్తుందని ఇది చాలా అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను కొనసాగించాలని, సర్వీసులో చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించా లని, 2017వ సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్న టిఎ బిల్లులు చెల్లించాలని కోరారు. వారికి ఉన్న జీతబకాయిలు వెంటనే ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని, ఇంకా అనేక సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్లు ఈ ఆందోళన చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.మధుసూదన రావు, యూనియన్ నాయకులు రఘురావమ్మ, సుభాషిణి, విజయలత, కళావతి, సుమలత, అంజలికుమారి, తదితరులున్నారు.

అంగన్‌వాడీల 36 గంటల ధర్నాకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మేకపాటి కుటుంబంపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-ఉదయగిరి
నియోజకవర్గ అభివృద్ధిపై మేకపాటి కుటుంబంపై విమర్శలు తగదని నియోజకవర్గ వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వైసిపి శ్రేణులు మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు మేకపాటి కుటుంబంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గం అభివృద్ధి జరిగితే మేకపాటి కుటుంబమేనని వారిని విమర్శించే స్థాయి మీది కాదని బొల్లినేనికి దీటుగా సమాధానమిచ్చారు. కొన్ని కోట్లు విలువ కలిగిన ఆస్తులు ప్రభుత్వానికి అప్పజెప్పడం విద్యపై వారికున్న శ్రద్ధ నీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. అలాంటి వారిని ఏక వచనంతో మాట్లాడడం నీకు సబబు కాదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎప్పుడు ఎక్కడ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం మేకపాటి కుటుంబం వెనుకాడ లేదని తెలిపారు. ఒక్కసారి గెలిచిన సీజన్ ఎంఎల్ఎగా ఉదయగిరి నియోజక వర్గానికి అభివృద్ధి ఎంత చేసారో అనే అంశంపై చర్చికి తాము సిద్ధమంటూ సవాల్ విసిరారు. 2024లో కూడా ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి రాజగోపాల్ రెడ్డిదే విజయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, టౌన్ వైసిపి నాయకులు షర్ఫుద్దీన్, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, కలిగిరి జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి, కలిగిరి మండల కన్వీనర్ రమణారెడ్డి, కొండాపురం జెడ్‌పిటిసి వెంకట్రావు, వరికుంటపాడు జెడ్‌పిటిసి రావిళ్ల నాగేంద్రబాబు, లెక్కల పెదమాల కొండారెడ్డి, మాధవరెడ్డి, పుల్లాయపల్లి వైసిపి నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పల్లవోలు, పడమటి నాయుడుపల్లి గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహశీల్దార్ ఆనందరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మస్తాన్‌ఖాన్ శనివారం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందించారు. పల్లవోలు గ్రామ సచివాలయంలో కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్, రేషన్ కార్డులకు సంబంధించి 400 మంది సమస్యలను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, వైసిపి మండల మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, ఎంపిటిసి గీత, సర్పంచ్ గంగినేని రవీంద్రబాబు, చంద్ర నారాయణస్వామి, గంగినేని శ్రీనివాసులు, పొంగూరు సుధాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, ఇర్లపాడు సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, పెగళ్లపాడు సర్పంచ్ చెవుల శ్రీనివాస్ యాదవ్, తదితరులున్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడు తహశీల్దార్ షాజియా బేగంలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు అనుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న సురక్ష పత్రాలను మారంరెడ్డిపల్లి సర్పంచ్ గాజులపల్లి భారతి చంద్రరెడ్డి, గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతి రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడును స్థానిక నాయకుడు గాజులపల్లి చంద్రరెడ్డి ఘనంగా సన్మానించారు. ఇఒపిఆర్‌డి భార్గవి, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమిష్టి కృషి

గృహ నిర్మాణశాఖ అధికారులతో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సమీక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్ల మాత్రమే కావని, వారి జీవితకాల కలలను సాకారం చేస్తూ ఊళ్లనే నిర్మిస్తున్నారని, ఆత్మకూరు నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమిష్టి సహకారంతో ఇళ్ల నిర్మాణాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుందామని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరం లో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపి డిఒ, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో మంజూరైన గృహాలు వేగవంతంగా ప్రారంభించి పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ నెలాఖరు లోగా లే అవుట్‌లో ఓ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టి తమకు చూపితే అదే విధంగా మిగిలిన నిర్మాణాలు సైతం జరిగేలా చర్యలు తీసుకుంటా మని వివరించారు. మున్సిపల్ పరిధిలో 1686 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు అధికారులు తెలియచేయడంతో వివిధ దశలోల ఉన్న వాటిని త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు కాంట్రాక్టర్లకు అవసరమైన మౌలిక వసతులు, నిర్మాణ వస్తువులు, ఇసుక, సిమెంటు, ఇనుము అన్నీ సకాలంలో అందించి వారిని మరింతగా ప్రోత్సహించాలని, డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల న్నారు. నియోజకవర్గంలో పలు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పర్యటిస్తున్న సమయంలో పోజిషన్ సర్టిఫికేట్లు మంజూరు చేసిన వారికి గృహ నిర్మాణాలు చేసుకునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు కాలేదని కొంత మంది లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకొస్తున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు కాని వివరాలను వెంటనే జాబితాను సిద్ధం చేసి అందచేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామ న్నారు. అన్ని మండలాల అధికారులు సత్వరమే స్పందించి నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణ పనులపై పురోగతి చూపాలని, వచ్చే రివ్యూ సమావేశం నాటికి పురోగతి లేకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల విషయమై శ్రద్ధ చూపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, హౌసింగ్ డిఇ నటరాజన్, మెప్మా సిఎండి మేనేజర్ అంకయ్య, సిఒ మాధవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని దేవరాయపల్లి బిట్-1 పరిధిలోని పాతదేవరాయపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముమ్మరంగా పర్యటించిన ఎంఎల్ఎ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అందచేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే కరపత్రాలను వారికి అందచేసి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పునరుద్ధరణ పనులు పూర్తి చేసుకున్న రక్షిత నీటి పథకాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన మాట్లాడుతూ దేశంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు పథకాలను రూపొందించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. మెట్ట ప్రాంతాల్లో జలయజ్ఞం పేరుతో లక్ష కోట్ల రూపాయలతో ప్రాజెక్ట్‌ల నిర్మాణాలను చేపట్టి అపర భగీరథుడిగా ప్రజలచే కీర్తింపబడిన వ్యక్తి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఉదయగిరి, ఆత్మకూరులాంటి మెట్ట నియోజకవర్గాల పరిధిలో ప్రారంభించిన మూడు మంచి నీటి ప్రాజెక్టలలో ఎంజిఆర్ సంగం బ్యారేజ్ ఇప్పటికే పూర్తయి రైతులకు ఉపయోగపడుతుం దని, మిగిలినవి కూడా పూర్తయితే ఈ ప్రాంతం మరింత సస్యశ్యామలంగా మారుతుందని, రైతులందరికీ బాంధవుడిగా నిలిచిన వైఎస్ఆర్‌ను ప్రజలంతా గుర్తుంచుకుంటారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇంతటి నిధులు ఎప్పుడూ విడుదల చేయలేదని, ప్రజలంతా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైసిపి తప్పక విజయం సాధిస్తుందని, సంక్షేమ పాలనను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంట నడిచేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పేయ్యల సంపూర్ణమ్మ, కన్వీనర్ అక్కల్ రెడ్డి అంకిరెడ్డి, అనంతసాగరం సహకార సంఘం అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఎంపిడిఒ మధుసూదన్ రావు, వైసిపి నాయకులు ఈశ్వరయ్య, దేవరాయపల్లి నాయకులు సుబ్బారెడ్డి, భాస్కర్, ఖాజా మొహిద్దీన్, నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-జలదంకి: మండలంలోని జమ్మలపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం శనివారం రెండవ రోజు కొనసాగింది. సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఉదయగిరి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ వచ్చే ఎన్నికలలో వైసిపికి పట్టం కట్టాలని ప్రజలను అభ్యర్థించారు. జగనన్న ఇచ్చిన హామీలన్నీ చేస్తున్నారని మరల జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ బాబు, తహశీల్దార్ సిహెచ్ పద్మావతి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాలవల్లి మాలకొండ రెడ్డి, గాజుల తాజుద్దీన్, గుర్రం జగ్గయ్య నాయుడు, తమ్మినేని సతీష్, రావి ప్రసాద్ నాయుడు, బోడి మల్ల కృష్ణారెడ్డి, ఇసుక మదన్మోహన్ రెడ్డి, సురే వెంకట శేషారెడ్డి, గుమ్మడి రమేష్, కాకాని మహదేవయ్య, దామెర్ల దేవదాసు, ఆలూరి లక్ష్మీనరసారెడ్డి, పిఆర్ ఏఈ వై.వాణి, ఇరిగేషన్ ఏఈ రోజ్‌మేరీ, పంచాయతీ సెక్రెటరీ కె రామకృష్ణారెడ్డి, విఆర్ఓ పి రమణయ్య, ఎపిఎం శ్రీధర్ రావు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి



ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఒప్పంద ప్రాతిపదికన అధ్యాపక సహోదరులు అధ్యాపక సహాయకులుగా నియమి తులైన ఉద్యోగులకు స్థానిక ఎంజిఆర్ వ్యవసాయ కళాశాలలో శనివారం మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ సాగర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మెరిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న 25 మంది అధ్యాపకులకు ఈ నియామక పత్రాలు అందజే శామన్నారు. ఒప్పంద ఉద్యోగులుగా నియమితు లైన వారు బాధ్యతగా పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలు పొందాలన్నారు. భవిష్యత్తులో అందరికీ మంచి జరుగుతుందన్నారు. మొదటగా కళాశాలలో రైతు దినోత్సవాన్ని నిర్వహించి రైతులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి గోపికృష్ణ, ఎం కిషన్ తేజ, యువ నాయకులు షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే ముస్లిముల అభివృద్ధి

ప్రజాశక్తి-ఉదయగిరి : ముస్లిముల అభివృద్ధి మసీదులకు దర్గాలకు మౌలిక వసతుల కల్పన, నిధులు మంజూరు మసీదులు, దర్గాల స్థితి గతులను మార్పు సిఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల వైసిపి మైనారిటీ జోనల్ ఇన్‌ఛార్జి సయ్యద్ హంజా హుసేని, వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ షేక్ సంధాని బాషా, వక్ఫ్‌బోర్డ్ జిల్లా కమిటీ సభ్యులు గడియాల్చి యజ్దానీ, ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలో మసీదు, దర్గాలల్లో హర్ దిల్ మే వైయస్ఆర్ హమ్ సభ్ జగన్ కే సాత్ అనే కార్యక్రమంలో విస్తృత పర్యటన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి : బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్న రషీద్‌కు మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. శనివారం స్థానిక దిలార్ బావి వీధికి చెందిన షేక్ రషీద్ అనారోగ్యానికి గురైనందున వైద్య ఖర్చులు కోసం మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు మన ఫౌండేషన్ తో రూ.10 వేలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఖాదర్ భాషా, అలీ, నౌషాద్, బాబు, జానిభాషా, జాకీర్, భో గ్యం శ్రీనివాసులు, గాజుల రంతుజాని, హర్షద్, రఫీ, అల్లూరి అంకయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి

ప్రజాశక్తి-నెల్లూరు
ప్రతేడాది జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపిస్తాం.. విద్యుత్తు ఛార్జీలను పెంచే ప్రసక్తే ఉండదని.. ఉద్యోగులకు సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఆర్భాటంగా హామీలు చేసి అధికారం వచ్చిన తరువాత వాటిని విస్మరించిన వైసిపి ప్రభుత్వ పాలనపై కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర అంతృప్తి నెలకొన్నది. మున్సిపల్ కార్మికులు ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ దశల వారీ నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమాలకు ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో తమ న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపాలని లేనిపక్షంలో 20న కార్పొరేషన్ కార్యాలయాన్ని మున్సిపల్ కార్మికులందరూ కలిసి ముట్టడి చేస్తామంటూ కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడులకు తలొగ్గి విద్యుత్తు సంస్కరణల పేరుతో ప్రజలు ఊహించని విధంగా విద్యుత్తు ఛార్జీలు రకరకాల పేర్లతో భారీగా పెంచి ప్రజల నడ్డివిరిచింది. విద్యుత్తు ఛార్జీలు భారీగా పెరగడమే కాకుండా కూరగాయల రేట్లు సైతం భారీగా పెరిగిపోవడంతో పచ్చిమిర్చి ఘాటు పెరిగిపోయింది. పచ్చిమిర్చికి పోటీగా టమోట రేటు సైతం ఆకాశమె హద్దుగా పెరిగిపోయింది. ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు తమకు ఎన్నికల సమయంలో సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేస్తామని హామీనిచ్చారు. ఈ హామీని విధిగా అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణా ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ అందజేస్తున్న వేతనం కంటే ఎకువ మొత్తంలో జీతాలు అందజేస్తామంటూ చేసిన హామీని అమలు చేయాలంటూ 36 గంటల పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై దాడులు, హింసలు పెరిగిపోతున్నాయని, వీటిని నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో 28 నుంచి ఆగస్టు 9వ తేది వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయకులు ప్రకటించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్రకు నగర, రూరల్ నియోజకవర్గంలో ఆపార్టీ నాయకులు ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి ఆదరణ లభించడంతో టిడిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నిండింది. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుంది. రైతులు షుమారుగా 500రోజులు ఢిల్లీలో చలిని సైతం లెక్కచేయకుండా కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో దొడ్డిదారిన అమలు చేయాలని ప్రయత్నించిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలంటూ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేసేందుకు సిద్ధం కావాలంటూ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో వ్యవసాయ, కౌలు రైతాంగానికి, కార్మికులకు పిలుపు నిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులను ప్రసన్నం చేసుకొనేందుకు గత ఎన్నికల్లో చేసిన హామీలు అమలు చేసే దిశగా వైసిపి ప్రభుత్వం అడుగులు వేస్తుందా.. లేక మొండిగా వ్యవహరిస్తుందా వేచి చూడాల్సి ఉంది.

వీక్షణం

In The Court Of The Senior Civil Judge : Balaji District
I.P.No. 2 / 2023
Chaluvadhi Padmavathi - Petitoner
Vs
1. Bayya Sravanthi
and 43 otehrs - Respondents
Notice
To,
R7. **Doddaga Siromani,** S/o Not Known, S/o Not Known, Bapuji Colony, Sullurpet, Thirupathi District.
R14. **Nariboyina Venkateswarlu,** S/o Not Known, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R16. **Mittadoddi Nagendra Kumari,** W/o **Vinod Kumar,** Bapuji Colony, Sullurpet, Thirupathi District.
R19. **Katamreddy Vinod,** Near RTC Bustand, Sullurpet, Thirupathi District.
R22. **K. Suvarna,** W/o **Lokesh,** Bazar Street, Sri Kala Hastri, Thirupathi District.
R24. **Bussam Vijayamma,** W/o Not Known, Srivari Nagar, Sullurpet, Thirupathi District.
R25. **Lakshmi,** C/o Keerthi Enclave, Sullurpet, Thirupathi District.
R27. **Ambati Aruna,** Bapuji Colony, Sullurpet, Thirupathi District.
R28. **Kaliveti Rama Krishna** Near Lakshmi Theatre, Sullurpet, Thirupathi District.
R35. **Jampa Nagar Raju,** Main Road, Meenjur, Tamil Nadu.
R36. **Chavali Lakshmi,** W/o **Siva Kumar,** Near Court Centre,Gudur, Thirupathi District.
R38. **S. Nagaiah,** Mannarupoluru Road, Sullurpet, Thirupathi District.
R42. **Parisineti Latheesh,** C/o **Y.Subha,** High School, Sullurpet, Thirupathi District.
పై నెంబరు కేసులో పిటిషనరు పై కోర్టులో **I.P.No. 2 / 2023** దాఖలు చేసియున్నారు. సదరు **I.P.**లో మీకు నోటీసు నిమిత్తం **తే29-8-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
టి.వి. సుబ్బారావు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది, నెల్లూరు.

In The Court Of The Senior Civil Judge : Balaji District
I.P.No. 1 / 2023
Chaluvadhi Srinivasulu - Petitoner
Vs
1. Alavala Venkateswarlu
and 34 otehrs - Respondents
Notice
To,
R1. **Alavala Venkateswarlu,** S/o **Bupaiah,** Park Street, Sullurpet, Thirupathi District.
R5. **Pasupuleti Hari,** S/o Not Known, Police Constable, Kavali, Nellore District.
R17. **Mogalluru Ramanjunamma,** W/o **Venkateswarlu,** Kacheri Street, Sullurpet, Thirupathi District.
R24. **Jampana Naga Raja Rao,** S/o Not Known, Door No.60/2003, Meenjuru, Main Raod, Tamil Nadu.
R25. **Vijayamma,** W/o **Vijay Kumar,** Sullurpet, Thirupathi District.
R26. **R. Nageswara Rao,** S/o Not Known, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R27. **Bhaskar,** S/o Not Known, Door No. 4/5/231, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R28. **Sivaji,** S/o Not Known, Kollamitta, Sullurpet, Thirupathi District.
R31. **Santhi,** W/o Not Known, Near Lakshmi Theatre, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R33. **Rapurth Rama Krishna,** S/o Not Known, Ambapuram, Nellore Town, Nellore District.
R34. **Y. Shuba,** W/o **Babu**, High School Road, Sullurpet, Thirupathi District.
R35. **TK. Nirmala Devi,** W/o **Krishnaiah**, Bapuji Street, Sullurpet, Thirupathi District.
పై నెంబరు కేసులో పిటిషనరు పై కోర్టులో **I.P.No. 1 / 2023** దాఖలు చేసియున్నారు. సదరు **I.P.**లో మీకు నోటీసు నిమిత్తం **తే29-8-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
టి.వి. సుబ్బారావు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది, నెల్లూరు.